సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 17 । మే । 2024



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

భీమవరం: ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పురిఘళ్ల రఘురామ్, అరుణ దంపతులు (పాలకోడేరు మండలం విస్సాకోడేరు) రూ.లక్ష విరాళంగా అందజేశారు.



గత వైభవం కనుమరుగు

మొగల్తూరు మామిడి విస్తీర్ణం క్రమేపీ తగ్గుతోంది. గతంలో 5 వేల ఎకరాల్లో తోటలు ఉండగా ప్రస్తుతం 2 వేల ఎకరాలలోపే ఉన్నాయి. 8లో ▸



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

నూరప్పగూడెంలో జాతీయ రహదారిపై బైక్‌ను మరో బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. 8లో ▸

న్యూస్‌రీల్

డెంగీ నివారణపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరరావు

వీరవాసరం: సమాజంలో ప్రతిఒక్కరూ డెంగీ వ్యాధి నివారణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం డెంగీ నివారణపై కొణితివాడ, వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిద్దామని, డెంగీ నుంచి రక్షణ పొందుదామన్నారు. ప్రతి ఇంట్లో ఉన్న నీటి నిల్వల మీద దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు వేసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు, డ్రెయిన్లలో మురుగు లేకుండా చూసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ నవనీత్, సీహెచ్‌ఓ దేవదాస్, కార్మొరికుమార్, పీఎస్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్



భీమవరంలో విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్, డీఎన్నార్, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలల్లో గురువారం ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో ఉదయం 175 మంది విద్యార్థులకు 154 మంది, మధ్యాహ్నం 175 మందికి 159 మంది హాజరయ్యారని కళాశాల పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.గోపాలకృష్ణమూర్తి తెలిపారు. డీఎన్నార్ కళాశాలలో ఉదయం 100 మందికి 88, మధ్యాహ్నం 100 మందికి 87 మంది, విష్ణు కళాశాలలో ఉదయం 99 మందికి 86 మంది, మధ్యాహ్నం 99 మందికి 88 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీ ఈఏపీసెట్-24 పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లాకు సంబంధించి నగరంలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తొలిరోజు పరీక్షలకు 888 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల షిఫ్టులో ఏలూరు సిద్ధార్థ క్వెస్ట్ కాలేజ్‌లో 180 మందికి గాను 162 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 140 మందికి 133 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 160 మందికి 151 మంది హాజరయ్యారు. మొత్తంగా ఉదయం సెషన్‌లో 480 మందికి గాను 446 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల షిఫ్టులో సిద్ధార్థ క్వెస్ట్ కాలేజీలో 180 మందికి 170 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 139 మందికి 128 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 159 మందికి 144 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో మొత్తం 478 మందికి 442 మంది హాజరయ్యారు.

భారీ వర్షం

భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, గూట్లపాడు, రాయలం, చినఅమిరం, దెయ్యాలతిప్ప, తోకతిప్ప, లోసరి, దొంగపిండి, అనాకోడేరు, కొమరాడ, ఎల్‌వీఎన్ పురం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, వెంప తదితర గ్రామాల్లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఏలూరు రూరల్: ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల ఆవరణలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల యూత్ బాస్కెట్‌బాల్ జట్టును గురువారం ఎంపిక చేసినట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ పర్యవేక్షణలో జరిగిన సెలెక్షన్స్‌లో ఏలూరుకు చెందిన ఆర్.రుత్విక, పి.జయశ్రీ, జి.పూజిత, పి.నందిని, ఎస్.రేణుక, ఎస్.సాయిభవానీ, డి.అమృత, బి.దేవీశ్రీ, జి.సరిత, కె.పూజిత, కొవ్వలికి చెందిన జి. యేసమ్మ, తాడేపల్లిగూడెంకు చెందిన ఎ.రియా జట్టులో స్థానం సంపాదించారు. అలాగే ఏలూరు నగరానికి చెందిన పి.లహరి, ఎంవీడీ భార్గవి, టి.పూజితను స్టాండ్ బై ప్లేయర్స్‌గా ఎంపిక చేశారు.

బ్రహ్మోత్సవ వైభవం
చూతము రారండి



గరుడాళ్వార్ విగ్రహం

చినవెంకన్న క్షేత్రం ముస్తాబు

- రేపటి నుంచి చినవెంకన్న తిరుకల్యాణోత్సవాలు
- 22న రాత్రి తిరు కల్యాణం
- 23న రాత్రి రథోత్సవం



గజ వాహనాన్ని ముస్తాబు చేస్తున్న సిబ్బంది



ద్వారకాతిరుమలలో వేంకటేశ్వరస్వామి క్షేత్రం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి (చిన వెంకన్న) క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 18 నుంచి 25 వరకు ద్వారకాతిరుమల దేవస్థానంలో శ్రీవారి వైశాఖ మాస తిరుకల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఏటా క్షేత్రంలో రెండు సార్లు వైఖానస ఆగమోక్తంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే వైశాఖ మాస బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉత్సవాలు జరిగే రోజుల్లో స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి ఉదయం, సాయంత్రం వేళల్లో పలు వాహనాలపై తిరువీధుల్లో విహరిస్తారు. అలాగే ఆలయ ముఖ మండపంలో శ్రీవారు రోజుకో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై ఉదయం నుంచి రాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

శరవేగంగా ఏర్పాట్లు..

బ్రహ్మోత్సవాలకు సమయం దగ్గర పడటంతో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. స్వామివారి వాహనాలను ముస్తాబు చేయడం, ఆలయ పరిసరాల్లో తాటాకు పందిళ్లను నిర్మించడం, విద్యుద్దీప అలంకారాలు చేసే పనులు ఊపందుకున్నాయి.



ఉభయ దేవేరులతో శ్రీవారు

ప్రత్యేక అలంకారాలు

18న	శ్రీ భూసమేత మహావిష్ణువు
19న	కాళీయమర్ధనం
20న	యోగ శ్రీనివాసుడు
21న	రామ లక్ష్మణ సమేత హనుమాన్
22న	మోహిని
23న	రాజమన్నార్
24న	మురళీకృష్ణ
25న	శయన మహావిష్ణువు

భారీగా తరలిరండి



శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాల్లో సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తాం. ఎనిమిది రోజులపాటు జరిగే ఉత్సవాలను వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలి. 22న స్వామివారి కల్యాణం, 23న రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహిస్తాం. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18 నుంచి 25 వరకు ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేశాం. భక్తులు గమనించాలి.

– వేండ్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

ఉత్సవాలు ఇలా..

- ఈనెల 18న ఉదయం శ్రీవారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- 19న రాత్రి 7 గంటల నుంచి అంకురార్పణ, రుత్విగ్వరణ అనంతరం బ్రహ్మోత్సవాల వీక్షణకు సర్వాది దేవతలను ఆహ్వానించే క్రమంలో ధ్వజారోహణను నిర్వహిస్తారు. రాత్రి 9 గంటల నుంచి హంస వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- 20న ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- 21న ఉదయం 7 గంటల నుంచి హనుమద్వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటల నుంచి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుంది. రాత్రి 8.30 గంటల నుంచి వెండి శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- 22న రాత్రి 8 గంటల నుంచి శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగునుంది. అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం, ఉదయం 7 గంటల నుంచి సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- 23న రాత్రి 7.30 గంటల నుంచి క్షేత్ర పురవీధుల్లో రథోత్సవం నిర్వహిస్తారు.
- 24 న ఉదయం 10.30 గంటల నుంచి చక్రవారి అవభృథోత్సవం, మధ్యాహ్నం 3 గంటల నుంచి వేద సభ, రాత్రి 7 గంటల నుంచి పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ, రాత్రి 8 గంటల నుంచి అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- 25న ఉదయం 9 గంటల నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, పవళింపుసేవ కార్యక్రమాలతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత రిటర్నింగ్ అధికారులకు గురువారం ప్రకటనలో ఆదేశించారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించి భీమవరం విష్ణు కళాశాలలో, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. స్ట్రాంగ్‌రూముల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేశారని తెలిపారు. మొదట కేంద్ర సాయుధ బలగాలు (ఐటీబీపీ), రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, మూడో అంచెలో స్థానిక సివిల్ పోలీసులను రక్షణగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లకు నిర్ణయించిన పరిధి వరకు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని పేర్కొన్నారు.

ప్రణాళికాబద్ధంగా..

స్ట్రాంగ్‌రూముల వద్ద నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు పోలింగ్ యంత్రాలు తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి మార్గాలు అన్నింటికీ ప్రణాళికాబద్ధంగా బ్యారికేడ్లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కౌంటింగ్ కేంద్రాలు ఇలా..

- ఆచంట నియోజకవర్గానికి సంబంధించి విష్ణు కాలేజీ ఆవరణలోని శ్రీమతి బి.సీత పాలిటెక్నిక్ కళాశాల రెండో అంతస్తు.
- పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధించి శ్రీమతి బి.సీత పాలిటెక్ కాలేజ్ సెకండ్ ఫ్లోర్ డ్రాయింగ్ హాల్ నెం.1.
- నరసాపురం నియోజకవర్గానికి సంబంధించి శ్రీ విష్ణు ఫుడ్ ప్లాజా–1 డైనింగ్ హాల్.
- తణుకు నియోజకవర్గానికి సంబంధించి శ్రీ విష్ణు స్కూల్ గ్రౌండ్ ఫ్లోర్.
- భీమవరం నియోజకవర్గానికి సంబంధించి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 'యు' బ్లాక్ రెండో అంతస్తు.
- ఉండి నియోజకవర్గానికి సంబంధించి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'ఎస్' బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్.
- తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 'యు' బ్లాక్ మూడో అంతస్తు నందు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

జిల్లాలో పోలింగ్ ప్రక్రియను ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశామని, ఇదే స్ఫూర్తితో కౌంటింగ్‌ని కూడా జయప్రదంగా పూర్తిచేసేందుకు కృషిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

గతం కంటే మెరుగైన ఫలితాలు

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో 2019 కంటే మెరుగైన ఫలితాలు రానున్నాయని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలోని నివాసంలో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు 2019లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై నమ్మకంతో 151 అసెంబ్లీ స్థానాలు, 22 ఎంపీ స్థానాలు ఇచ్చారన్నారు. ఈ ఐదేళ్లలో సీఎం జగన్ పాలనపై ప్రజలు చాలా సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. 2024 ఎన్నికల ఫలితాల్లో ఈ విషయం ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నారు. ఐప్యాక్ బృందంతో సీఎం జగన్ మాట్లాడిన సందర్భంలో గతం కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తున్నామని చాలా నమ్మకంతో చెప్పారన్నారు. దేశ రాజకీయాల్లో ఏ రాష్ట్రమైనా ప్రజా సంక్షేమం వైపు దృష్టి సారించి వారి అవసరాలు తీర్చడం కోసం పనిచేయాలన్నారు. సీఎం జగన్ ఇది చేసి నిరూపించారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయం, మహిళా సాధికారత వంటి రంగాల్లో ప్రభుత్వం అండదండలుగా ఉంటుందనే నమ్మకాన్ని సీఎం జగన్ ప్రజల్లో కల్పించారన్నారు. చెప్పాడంటే చేస్తాడంతే అనే ప్రగాఢ విశ్వాసం జగన్ పాలన చూసిన తర్వాత కలిగిందన్నారు. ఈ ప్రభావంతో గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు వస్తాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.


1.97 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 2.40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి గాను ఇప్పటివరకు 1,97,129.920 టన్నుల ధాన్యాన్ని సేకరించామని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. రైతుల ఖాతాలకు ధాన్యం సొమ్ములు రూ.225.67 కోట్లను జమ చేశామన్నారు.

ఉన్నత చదువులకు దీవెనలు

పేద విద్యార్థులకు భరోసా

- జగనన్న వసతి, విద్యా దీవెనలతో అండ
- ఐదేళ్లలో విద్యా దీవెన కింద రూ.450.77 కోట్ల లబ్ధి
- వసతి దీవెన కింద రూ.171.38 కోట్ల ప్రయోజనం
- పోలింగ్ ముగియడంతో పెండింగ్ బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం



ఏలూరులో జగనన్న వసతి దీవెన పథకంలో చెక్ అందిస్తున్న దృశ్యం (ఫైల్)

సంవత్సరం	జగనన్న విద్యాదీవెన		జగనన్న వసతి దీవెన	
	విద్యార్థులు	లబ్ధి రూ.కోట్లలో	విద్యార్థులు	లబ్ధి రూ.కోట్లలో
2019–20	36,527	95.78	36,580	36.86
2020–21	37,148	77.97	37,750	35.76
2021–22	38,677	105.67	36,350	34.76
2022–23	33,655	81.53	32,316	30.96
2023–24	29,111	67,.35	30,250	28.42
	1,75,118	450.77	1,73,246	171.38

ఏలూరు (టూటౌన్): పేద విద్యార్థుల ఉన్నత చదువులకు జగన్ సర్కారు భరోసా కల్పిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా, వసతి దీవెనలు అక్కరకు వస్తున్నాయి. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, డిప్లమో వంటి కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, అగ్రవర్ణ పేద విద్యార్థుల చదువులకు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను జగనన్న విద్యా దీవెన పథకం కింద అందిస్తోంది. దీనికి తోడు జగనన్న వసతి దీవెన పేరుతో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఇలా ఐదేళ్లుగా లక్షలాది మంది విద్యార్థులకు ప్రభుత్వ ప్రయోజనం చేకూరింది. ఏలూరు జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 1,75,118 మందికి రూ.450.77 కోట్లు, వసతి దీవెన పథకం ద్వారా 1,73,246 మందికి రూ.171.38 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జగనన్న విద్యాదీవెన సొమ్ములు లబ్ధిదారుల ఖాతాలకు జమ కాకుండా ఆగిపోయాయి. తాజాగా ఈనెల 13న ఎన్నికల పోలింగ్ ముగియడంతో ప్రభుత్వం ఈనెల 15న జగనన్న విద్యాదీవెన నిధులను విడుదల చేసింది.

మొత్తంగా రూ.622.15 కోట్లు

ఏలూరు జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం కింద ఐదేళ్లలో 1,75,118 మందికి రూ.450.77 కోట్ల ప్రయోజనం చేకూరింది. ఎన్నికలకు ముందు నిధులు విడుదల చేసినా కోడ్ అమలులోకి రావడంతో విద్యార్థుల ఖాతాలకు జమ కాలేదు. ఆ నిధులను ఈనెల 15న ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో విద్యార్థుల తల్లుల ఖాతాలకు నేరుగా సొమ్ము జమవుతున్నాయి. అలాగే జిల్లాలో జగనన్న వసతి దీవెన పథకం కింద 1,73,246 మందికి రూ.171.38 కోట్ల మేరకు ప్రయోజనం చేకూరింది. 2023–24 విద్యా సంవత్సరంలో 30,250 మందికి రూ.28.42 కోట్ల ప్రయోజనం చేకూరింది. ఈ రెండు పథకాల ద్వారా పేద పిల్లల విద్యకు రూ.622.15 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది.

చదువులు సాఫీగా..



జగనన్న వసతి దీవెన, విద్యా దీవెనల పథకాలు మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా కాలేజీ ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు ఉండటం లేదు. దీంతో చదువులు సాఫీగా సాగుతున్నాయి. మాలాంటి మధ్యతరగతి విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కావడం లేదు. ప్రభుత్వ సాయం మరువలేం.

– సీహెచ్ రసజ్ఞ, ఇంజనీరింగ్ విద్యార్థిని, ఏలూరు


ప్రభుత్వ సహకారంతో..



ప్రభుత్వ సహకారంతో ఇంజినీరింగ్ సాఫీగా సాగుతోంది. పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందిస్తుండటంతో మా కుటుంబానికి ఎలాంటి సమస్య తలెత్తడం లేదు. ఇదంతా జగనన్న ప్రవేశపెట్టిన విద్యా, వసతి దీవెనలతోనే సాధ్యమైంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– తామరపల్లి మోహన చంద్రిక, ఇంజనీరింగ్ విద్యార్థిని, ఏలూరు

చాలా మేలు



జగనన్న వసతి దీవెన, విద్యా దీవెనల పథకాలు మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా కాలేజీ ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు లేవు. దీంతో మా చదువులు సాఫీగా సాగుతున్నాయి. మాలాంటి పేద విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కాకుండా ఉంది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– కె.అరవింద్, ఇంజనీరింగ్ విద్యార్థి, ఏలూరు

నా కల సాకారం



ఇంజనీర్ కావాలనే నా కల నెరవేరింది. ఇంజనీరింగ్ చదువుకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందిస్తుండటంతో మా కుటుంబానికి చాలా మేలు జరుగుతుంది. నా చదువు సైతం సాఫీగా సాగిపోతుంది. ఇదంతా జగనన్న ప్రవేశపెట్టిన విద్యా, వసతి దీవెన పథకాలతోనే సాధ్యమైంది.

– ఎన్.మాధవ్, ఇంజనీరింగ్ విద్యార్థి, ఏలూరు

క్లుప్తంగా

జూన్ 24 నుంచి బ్లాక్ చైన్ టెక్నాలజీపై అవగాహన

భీమవరం : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 24 నుంచి ఐదు రోజులపాటు జాతీయస్థాయిలో సైబర్ సెక్యూరిటీ బ్లాక్ చైన్ టెక్నాలజీపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన బ్రోచర్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజుతో కలిసి విడుదల చేశారు. అనంతరం ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ కేవీ కృష్ణంరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఎఫ్‌డీపీలో నూతన టెక్నాలజీని ఫ్యాకల్టీకి అందించనున్నామని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ పి.రవికిరణ్ వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కవిత వ్యవహరిస్తారని తెలిపారు.

గత వైభవం కనుమరుగు

- తగ్గుతున్న మొగల్తూరు మామిడి విస్తీర్ణం
- గతంలో 5 వేల ఎకరాల్లో తోటలు
- ప్రస్తుతం 2 వేల ఎకరాల లోపే


మొగల్తూరులో మామిడి తోటలు

నరసాపురం: మొగల్తూరు పేరు చెపితే.. రాజుల పాలనా వైభవం, తీర ప్రాంత చేపల రుచులు మాత్రమే కాదు.. వేసవిలో మామిడిపళ్లు నోరూరిస్తాయి. ఇసుక నేల సారం వల్ల అద్భుత రుచి ఉండే మొగల్తూరు మామిడికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరుంది. దేశ విదేశాల్లోని తమ బంధువులు, స్నేహితులకు ఏటా వేసవి సీజన్‌లో మొగల్తూరు మామిడిపళ్లను పంపుతారు. నూజివీడు మామిడికి సమానంగా మొగల్తూరు మామిడికి పేరుంది. ఇప్పుడు మొగల్తూరు మామిడి ప్రాభవం కోల్పోతుంది. పెరుగుతున్న పట్టణీకరణతో తోటలు కొట్టేస్తున్నారు. దీంతో విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఇక తోటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. దీంతో కాపు తగ్గుతోంది.

మొగల్తూరు మామిడా.. మజాకా!

మొగల్తూరు, పేరుపాలెం చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు 1500 ఎకరాల్లో మామిడితోటలున్నాయి. చెరుకురసం, చిన్నరసాలు, పెద్దరసాలు, కొత్తపల్లి కొబ్బరి ఇక్కడ ఫేమస్. ముఖ్యంగా మొగల్తూరు బంగినపల్లికి మంచి పేరుంది. ఆవకాయ పచ్చళ్లకు సంబంధించి సువర్ణరేఖ, కలెక్టర్, హైజర్లకు డిమాండ్ ఉంది. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచే కాకుండా, పక్క జిల్లాల నుంచి అటు మామిడిపళ్లు, ఇటు పచ్చడి రకాలు కొంటారు. వేసవి సీజన్ వచ్చిందంటే మొగల్తూరు మామిడి మార్కెట్ కిటకిటలాడుతుంది.

తెగుళ్ల బారిన తోటలు

మచ్చతెగులు, మంచు తెగులు వంటి వ్యాధులు ఇటీవల సోకుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడంతో ఇళ్ల స్థలాలకు లేఅవుట్ల కోసం తోటలు నరికేస్తున్నారు. దీంతో విస్తీర్ణం తగ్గిపోతుంది. ఒకప్పుడు 5 వేల ఎకరాల్లో మొగల్తూరు చుట్టుపక్కల మామిడి తోటలుండేవి. ఇప్పుడు విస్తీర్ణం 2 వేల ఎకరాలకు పడిపోయింది. ప్రస్తుతం తోటల కంటే ఇక్కడ ప్రతి ఇంటి పెరట్లో కొన్ని చెట్లు ఉంటున్నాయి. ప్రతి ఇంటి పెరట్లో, అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాల్లో మామిడి చెట్లు పెంచుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా గాలి దుమారంతో పిందెలు, కాయలు కూడా రాలిపోవడం వంటి కారణాలతో కూడా కాపు తగ్గుతుంది. మొగల్తూరు మామిడి వ్యాపారం వేసవి సీజన్‌కు ముందే ప్రారంభమవుతుంది. శీతాకాలంలో పిందె దశలోనే రైతులు తోటల్లో పంటను విక్రయిస్తుంటారు. ఒక్కో చెట్టు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ విక్రయిస్తుంటారు. చెట్ల కాపును బట్టి వ్యాపారులు కొని కాయలు తయారయ్యాక విక్రయిస్తారు. సీజన్‌లో ప్రతి రోజూ ఉదయం మొగల్తూరులో మార్కెట్ జరుగుతుంది. మొగల్తూరు నుంచి సీతారామపురం వరకూ 216 జాతీయ రహదారి దారిపొడవునా మామిడిపళ్లు విక్రయిస్తారు.

లేట్‌గా వచ్చినా టేస్ట్‌లో బెస్ట్

మొగల్తూరు మామిడి పళ్లు ఆలస్యంగా కాపుకు వస్తాయి. జిల్లాలో చాలాచోట్ల మొగల్తూరు మామిడి పేరుతో, వేరే ప్రాంతాల నుంచి తెచ్చిన పళ్లను విక్రయిస్తారు. మే రెండోవారం నుంచి జూన్, జూలై నెలల్లో కూడా మొగల్తూరు మామిడిపళ్లు దొరుకుతాయి. మొగల్తూరు మామిడిపళ్లు వరక రూ.200 వరకూ అమ్ముతారు. బంగినపల్లి రకం కాయ డిమాండ్ బట్టి రూ 30 నుంచి రూ.70 వరకూ పలుకుతుంది.


మొగల్తూరు మార్కెట్‌లో మామిడి విక్రయాలు

కాపు అంతంత మాత్రమే



ఈ ఏడాది కాపు అంతంత మాత్రమే.. గత మూడేళ్ల నుంచి కాపు సరిగా లేక, మరోపక్క తెగుళ్లతో ఇబ్బంది పడ్డాం. తోటలతో సరైన ఆదాయం రాలేదు. ఈ సంవత్సరం ఆదాయం పెరుగుతుందని అనుకున్నాం. కాపు తక్కువగా ఉన్నా రేటు బాగుంది. ఇప్పటికే మామిడికాయల కోసం వ్యాపారులు వచ్చి కలుస్తున్నారు. మొగల్తూరు మామిడికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది.

– మన్నె ముత్యాలరావు,, మొగల్తూరు, రైతు

తగ్గిపోతున్న తోటలు



తోటలు తగ్గిపోతున్నాయి. కాపు తగ్గిపోతుంది. తోటలు నరికేసి లేఅవుట్లు వేస్తున్నారు. మా చిన్నప్పుడు కాపు ఇప్పుడు లేదు. దీంతో ధరలు కూడా పెరుగుతున్నాయి. మిగిలిన చోట్ల సీజన్ అయిపోతుంటే మాకు ప్రారంభమవుతుంది. దీంతో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడి నుంచి బయట దేశాల్లో ఉన్న బంధువులకు, స్నేహితులకు మామిడి కాయలు పంపిస్తారు.

– బి.భోగేశ్వరరావు, పేరుపాలెం, రైతు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


వడలిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం

పెనుగొండ: వడలిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. పెనుగొండ ఎస్సై షేక్ సుభాని తెలిపిన వివరాల ప్రకారం వీరవాసరం మండలం కొణితివాడకు చెందిన యరకరాజు దుర్గాభవాని(39), చిన్న కుమార్తె మాధురీలత, పెద్ద కుమార్తె కుమారుడు హరీష్‌తో కలిసి మోటారు సైకిల్‌పై కోనసీమ జిల్లా పేరవరం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వడలిలోని రైసుమిల్లు సమీపంలోకి వచ్చే సరికి సిద్ధాంతం నుంచి పెనుగొండ వెళ్తున్న లారీ ఢీకొనడంతో దుర్గాభవాని సంఘటన స్థలంలోనే మృతి చెందింది. మాధురీలత తీవ్రంగా గాయపడడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరించారు. హరీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో తీవ్ర విషాదం అలముకుంది. గత రెండు రోజులుగా వరి చేల నుంచి మట్టి తవ్వకాలు జరుగుతుండడంతో రోడ్డుపై పడిన మట్టికి తోడు గురువారం వర్షం పడడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని, అందువల్లే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



సూరప్పగూడెం ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ట్రాక్‌మెన్ బద్రి లోకేష్, నాగూర్‌బీ

భీమడోలు: సూరప్పగూడెం ఫ్లైఓవర్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. విజయనగరం జిల్లా పలాసకు చెందిన బద్రి లోకేష్ భీమడోలు రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా బైక్‌పై వెళ్తున్నాడు. మంగళగిరికి చెందిన పఠాన్ నాగూర్‌బీ, తన కుమారుడు తారక్, కుమార్తె నానుతో కలిసి బైక్‌పై ద్వారకా తిరుమలలో స్వామిని దర్శించుకుని స్వగ్రామానికి బయల్దేరారు. తారక్ బైక్ నడుపుతుండగా మధ్యలో నాను, చివర నాగూర్‌బీ కూర్చుంది. తారక్ ముందు వెళ్తున్న లోకేష్ బైక్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో బద్రి లోకేష్(28) తలకు తీవ్రగాయాలై అక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో నాగూర్‌బీ(41) తలకు తీవ్ర గాయమైంది. నాగూర్ బీను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో గాయపడ్డ తారక్, నానులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి శవ పంచానామా నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు


గుండుగొలనులో రేషన్ షాపులో సరుకును సీజ్ చేసిన అధికారులు

భీమడోలు : గుండుగొలనులోని రేషన్ దుకాణంపై గురువారం విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో అదనంగా ఉన్న 122 కేజీల బియ్యం, 7 ప్యాకెట్ల పంచదార, గోధుమ పిండి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. డీలర్ ఎస్.లక్ష్మీ శివకుమారిపై కేసు నమోదు చేసారు. తనిఖీల్లో స్టాక్ రిజిస్టర్లలో ఉండాల్సిన సరుకు కన్నా అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వీఆర్వో వి.వెంకటేశ్వరరావు పంచనామా నిర్వహించారు.

18న త్రోబాల్ సబ్ జూనియర్ నేషనల్స్ సెలెక్షన్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం (ఐజీఎంసీ)లో ఈ నెల 18న ఉదయం 9 గంటల నుంచి త్రోబాల్ సబ్ జూనియర్ నేషనల్స్ సెలక్షన్లు జరుగుతాయని త్రోబాల్ పశ్చిమగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఏఆర్‌కే వర్మ, సెక్రటరీ ఎస్.ఎం.శ్రీనాథ్ తెలిపారు. సెలక్షన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. 01.01.2010 తరువాత పుట్టిన వారై ఉండాలని, ఆధార్ కార్డు జిరాక్స్, ఎనిమిది పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు అందించాలని, మరిన్ని వివరాలకు 97012 03030, 72879 65417 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

హత్య చేసిన వ్యక్తి అరెస్టు

టి.నరసాపురం: టి.నరసాపురంలో వ్యక్తిని హత్య చేసిన పెసరగంటి మంగయ్యను గురువారం జీలుగుమిల్లి సీఐ పి.క్రాంతి కుమార్ అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. టి.నరసాపురం తూర్పుగూడానికి చెందిన రాయల వీరాస్వామి భార్యతో అదే గ్రామానికి చెందిన మంగయ్యకు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం వీరాస్వామికి తెలియడంతో.. వీరాస్వామిని అడ్డు తొలగించుకోవాలని మంగయ్య ప్లాన్ వేశారు. ఈ నెల 10న తూర్పుగూడెం శివారు పామాయిల్ తోట దగ్గరకు వీరాస్వామిని మంగయ్య తీసుకువెళ్లి మద్యం తాగించాడు. తరువాత అతనితో గొడవపడి వీరాస్వామిని కత్తితో పొడిచాడు. గాయపడిన వీరాస్వామి చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందాడు. టి.నరసాపురం పోలీసులు హత్య కేసు నమోదు చేయగా, కేసును సీఐ క్రాంతికుమార్ దర్యాప్తు చేస్తున్నారు. మంగయ్యను గురువారం అరెస్టు చేసి చింతలపూడి కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

శ్రీ షిర్డీసాయి విద్యార్థులకు జాతీయ ర్యాంకులు


ఆలిండియా 2వ ర్యాంకు సాధించిన ఐన్ల ఏవోను అభినందిస్తున్న దృశ్యం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలో తమ విద్యార్థులు సత్తా చాటారని రాజమహేంద్రవరం శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల డైరెక్టర్ టి.శ్రీవిద్య గురువారం తెలిపారు. తమ డాఫ్నీ సివిల్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మిజోరం రాష్ట్రానికి చెందిన ఐన్ల ఏవో ఆలిండియా 2వ ర్యాంకు సాధించిందన్నారు. జి.ప్రసన్నసాయి ఆలిండియా 328వ ర్యాంకు, ఎస్.భావన 504వ ర్యాంకు సాధించి ఫ్యాషన్ టెక్నాలజీలో ఉన్నత విద్య అభ్యసించడానికి అర్హత సాధించారన్నారు. దేశవ్యాప్తంగా 18 విశ్వవిద్యాలయాలలో కేవలం 4,051 సీట్లు మాత్రమే ఉంటాయని, అందులో ముగ్గురు తమ విద్యార్థులే కావడం ఆనందదాయకమన్నారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ ఐఐటీ, నీట్ వంటి రెగ్యులర్ కోర్సులతో పాటు సివిల్స్, క్లాట్, ఐపీమ్యాట్, క్యూట్ వంటి కోర్సులను తమ విద్యార్థులు ఎంపిక చేసుకోవడం హర్షణీయమన్నారు.

డయేరియాతో చిన్నారి మృతి

- కురుములతోగు, గుత్తికోయ గ్రామాల్లో వైద్య శిబిరాలు
- బాధిత కుటుంబాల్ని పరామర్శించిన ఐటీడీఓ పీవో


డయేరియా బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ


చికిత్స పొందుతూ మృతిచెందిన దేవరాజు (5)

కుక్కునూరు: డయేరియాతో భద్రాచలం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కురుములతోగు గ్రామానికి చెందిన దేవరాజు (5) మృతి చెందాడు. దామరచర్ల పంచాయతీ కురుములతోగు గ్రామానికి చెందిన గిరిజనులు కలుషిత నీటిని తాగడంతో అనారోగ్యానికి గురయ్యారు. వారిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని భద్రాచలం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వారిలో దేవరాజ్ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ముగ్గురు మహిళలు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు సమాచారం. డయోరియాతో బుధవారం బొజ్జమ్మ అనే మహిళ మృతిచెందిన సంగతి తెలిసిందే.. బాధిత కుటుంబాలను గురువారం కేఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ పరామర్శించారు. కురుములతోగులో గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వెంటనే గ్రామంలో హ్యాండ్‌బోర్ వేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులకు నిత్యవసర సరుకులను అందించనున్నట్టు చెప్పారు. గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేలా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్తులు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. గ్రామస్తులు తాగేందుకు మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేశారు. పీఓతో పాటు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎస్.శర్మిష్ట, డీఎల్‌పీఓ రజావుల్లా, వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహారాజు, రావు వినోద్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు

బాధిత గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గురువారం మండలంలోని కురుములతోగు, గుత్తికోయ గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించారు. ఇప్పటికే కురుమలతోగు గ్రామానికి చెందిన 10 మంది అస్వస్థతకు గురికాగా, వీరిలో ఇద్దరు మరణించారు. గురువారం గుత్తికోయలో మరో ముగ్గురు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతుండగా, వారిని వైద్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మండలంలోని డయరియా వ్యాపిస్తున్న నేపథ్యంలో వ్యాధి తీవ్రత తగ్గేంతవరకు వైద్యశిబిరాలు కొనసాగిస్తామని డీఎల్‌పీవో రజావుల్ల తెలిపారు.

నీటి కాలుష్యం కారణం కాదు

డయేరియాకు కారణం గిరిజనులు తాగిన నీరు కాదని ఎంపీడీవో నరసింహారావు చెప్పారు. నీటి నమూనాలు పరీక్షలకు పంపించగా.. అందులో ఎలాంటి కాలుష్యం లేనట్టు తేలిందన్నారు.

సేంద్రియ, జీవన ఎరువులే మేలు

పాడి-పంట




ఆలూరు చాముండేశ్వరి

నూజివీడు: భూమిలో పోషకాల లోపం ఉంటే భర్తీకి రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడుతున్నారు. ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులు పంటలు పండించేటప్పుడు కొన్ని పోషకాలు అధికంగా ఇవ్వడం, మరికొన్ని తక్కువగా ఇవ్వడం వల్ల పోషక లభ్యతలో సమతుల్యత లేక పంటల ఉత్పాదకత తగ్గిపోతుంది. పోషకాలను రసాయన ఎరువుల రూపంలో అవసరానికి మించి వాడటంతో భూభౌతిక లక్షణాలు మారిపోయి సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. ఈ పరిస్థితులలో భూములు ఎక్కువ కాలం సాగుకు పనికివచ్చేలా ఉండాలంటే రైతులు రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ, జీవన ఎరువులను వాడాలని నూజివీడు వ్యవసాయాధికారిణి ఆలూరు చాముండేశ్వరి పేర్కొన్నారు. సేంద్రియ, జీవన ఎరువుల వల్ల ఉపయోగాల గురించి ఆమె సూచనలు అందించారు.

రసాయన ఎరువులతో నష్టాలు

నేలలోని పోషకాల సమతుల్యత దెబ్బతినడమే కాకుండా నేల ఉత్పాదక శక్తిని కోల్పోతుంది. రసాయన ఎరువులను విచక్షణారహితంగా వాడటం వల్ల నేలలో కాలుష్యం పెరిగి సహజత్వం దెబ్బతింటుంది. చౌడు సమస్య ఏర్పడటంతో పాటు సూక్ష్మపోషక లోపాలు ఏర్పడతాయి. దీంతో చీడపీడలు పంటలను ఎక్కువగా ఆశిస్తాయి. చివరకు మొక్కలు బలహీనంగా పెరిగి దిగుబడి తగ్గిపోతుంది.

సేంద్రియ ఎరువులలో పచ్చిరొట్ట ఎరువులు

పచ్చిరొట్ట విత్తనాలు పొలంలో చల్లుకుని పంట పూత దశలలో భూమిలోనే కలియదున్నాలి. ఇలా చేయడం వల్ల 30 నుంచి 35 శాతం వరకు నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ఖరీఫ్ పంటకు ముందు వర్షాకాలంలో పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసుకోవాలి. జీలుగ, జనుము, అలచంద, పిల్లిపెసర, పెసర తదితర పచ్చిరొట్ట ఎరువులు బాగా ఉపయోగపడతాయి.

కంపోస్టు ఎరువు

వ్యవసాయ వ్యర్థాలు, ఆకులు తదితర వాటిని కొంతకాలం పాటు కుళ్లించిన తరువాత ఎరువుగా వాడతారు. అలాగే వానపాముల నుంచి వచ్చిన విసర్జనను ఎరువుగా వాడతారు. వీటి వాడకం వల్ల కూడా భూసారం పెరుగుతుంది. వానపాముల నుంచి వచ్చిన విసర్జనను వర్మీకంపోస్టు అంటారు. దీనిని ఎకరాకు ఒకటి నుంచి ఒకటిన్నర టన్ను వరకు ఉపయోగించవచ్చు. వరిపంటకు నాటిన తరువాత, మిగతా పంటలలో దుక్కిలో వేసి కలియదున్నాలి. అలాగే పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, మేకల ఎరువు, గొర్రెల ఎరువులు వాడుకోవాలి.

సేంద్రియ ఎరువుల వల్ల లాభాలు

నేలలో నీటిని పట్టి ఉంచే గుణం పెరుగుతుంది. భూసారం పెరగడంతోపాటు వివిధ పోషకాలు మార్పిడి చెందే శక్తి నెలలో పెరుగుతుంది. మొక్కలకు చీడపీడలను తట్టుకునే శక్తి వస్తుంది. నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది సుస్థిర దిగుబడులు సాధించవచ్చు. దిగుబడులు పెరుగుతాయి. నేలలో కాలుష్యం తగ్గుతుంది. ప్రకృతిలోగల సూక్ష్మజీవులు మొక్కలతోను కలిసి జీవించేటప్పుడు పంటలకు కావాల్సిన పోషకాలను వాతావరణం నుంచి గ్రహించి మొక్కలకు అందిస్తాయి. అందుకే వీటిని జీవన ఎరువులుగా గుర్తించారు. రైజోబియం, నీలి ఆకుపచ్చ నాచు, అజొల్లా, అజటోబాక్టర్ తదితర జీవన ఎరువులు ఉన్నాయి. ఇవి నత్రజనిని స్థిరీకరిస్తాయి.

జీవన ఎరువుల వల్ల లాభాలు

ఇవి మొక్కలకు ఎరువులను, పోషకాలను, వివిధ హార్మోనులను, విటమిన్లు, ఎంజైములు చేరుస్తాయి. నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను, చీడలను అరికడతాయి. 25 శాతం వరకు నత్రజని, భాస్వరం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తాయి. మిత్రపురుగులకు ఎలాంటి హాని జరగదు. దీంతో నేలలో కాలుష్యం తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుంది. 20 శాతం వరకు దిగుబడులు పెరుగుతాయి.

కిక్కిస పొదలకు నిప్పు


మండవల్లి మండలం కలకర్రులో తగలబడుతున్న కిక్కిస పొదలు

కైకలూరు: అక్రమ చేపల సాగు కోసం కొల్లేరు ప్రాంతంలో కిక్కిసను కొందరు తగలబెడుతున్నారు. సాధారణ సమయంలో నీటిలో కిక్కిస పొదలను తొలగించడం కష్టం. వేసవిలో చిన్న నిప్పురవ్వ మొత్తం కిక్కిసను తుడిచిపెడుతోంది. ఇదే అవకాశంగా చేసుకుని కొంతమంది ప్రతీ వేసవిలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో కిక్కిసను తగలబెడుతున్నారు. పెదఎడ్లగాడి వంతెన సమీపంలోని ఏలూరు జిల్లా కలకర్రు ప్రాంతంలో గురువారం పెద్ద ఎత్తున కిక్కిసను తగలబెట్టారు. దీంతో దట్టంగా పొగలు అలముకున్నాయి. ఈ విషయమై అటవీశాఖ రేంజర్ కుమార్‌ను వివరణ కోరగా కిక్కిసను తగలబెడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. కొల్లేరు కిక్కిస పొదల్లో అరుదైన పక్షి జాతులు నివాసం ఉంటాయని.. పర్యావరణానికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలి



వేసవి శిక్షణ కార్యక్రమంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

తణుకు టౌన్ : వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, చెప్పించడం, పుస్తక సమీక్ష వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వైకుంఠపాళీ ఆటను వివరించి ఆడించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులతో పాటు రీసోర్సు పర్సన్ ఎల్ వెంకట రమణ, జీ బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో భవన్స్ విద్యార్థుల హవా

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు పదవ తరగతి, 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని సంస్థ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు (రంగరాజు) తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదవ తరగతిలో పి.శ్రీవిద్య 486 మార్కులతో స్కూల్ ప్రథమంగా నిలిచినట్లు తెలిపారు. 12వ తరగతిలో పి.విక్రమాదిత్య 482 మార్కులతో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించడం పట్ల స్కూలు ప్రిన్సిపల్ రాజీవ్ కుమార్ శర్మ, స్కూల్ కమిటి సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి



కె సముద్రపుగట్టులో సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల సర్వే చేస్తున్న సమగ్రశిక్ష అధికారులు

అత్తిలి: దివ్యాంగులను ప్రతి ఒక్కరూ అదరించాలని జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో ప్రత్యేక అవసరాలుగల పిల్లల నమోదు కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి సీడబ్ల్యూఎస్ఎన్ సర్వే చేయగా కొత్తగా ఇద్దరు పిల్లలను గుర్తించామని చెప్పారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత పాఠశాలలో చేరిృంచడం ద్వారా వారికి ప్రభుత్వపరంగా వివిధ రకాల అలవెన్సులతో పాటు వారికి అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు భవిత కేంద్రాలలో ఫిజియోథెరపీ సేవలు కూడా అందిజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ పి శ్రీనివాసరావు, ఎంఈవోలు ఎన్ రమేష్, ఎంపీఏలేకే ప్రసాద్, ఐఈఆర్టీ ఉపాధ్యాయిని కేఎస్ రమ్య, జె ఏసురాజు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



అత్తిలిలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

అత్తిలి: మండలంలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అత్తిలి పోస్టుమాస్టర్ సీహెచ్వీ సుబ్బారావు కోరారు. గురువారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో పఠనాశక్తి, జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి శిక్షణ శిబిరాలు దోహదపడతాయన్నారు. గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, రిసోర్సు పర్సన్లు కె కోమలి పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని పీపీ యూనిట్ విభాగంలో డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: జాతీయ డెంగీ దినోత్సవం కార్యక్రమాన్ని తణుకు పీపీ యూనిట్, అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు, డాక్టర్ రవికుమార్, డాక్టర్ కె.పృథ్వీరాజ్, డాక్టర్ రాజా నాగభూషణం, డాక్టర్ కె.డానియల్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో డెంగీ వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెక్టార్ బోర్న్ డీసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డెంగీ అనేది వైరస్ కారకమని, ఈడిస్ ఈజిప్ట్ దోమ కాటు ద్వారా వస్తుందని అన్నారు. కదలికలేని చిన్నచిన్న నీటి నిల్వల్లోను ఓవర్ హెడ్ ట్యాంకులు, రుబ్బురోళ్లు, పాడైన టైర్లు, తాగిపారేసిన కొబ్బరి బొండాలు, ఫ్రిజ్‌ల వెనుక ఉండే ట్రేల్లోను ఈ తరహా దోమలు గుడ్లు పెడతాయని చెప్పారు. 8 నుంచి 10 రోజుల్లో ఈ గుడ్లు దోమలుగా రూపాంతరం చెందుతాయని స్పష్టం చేశారు. అందుచేత ప్రతి ఇంట్లోను వారానికోసారి డ్రైడే పాటించి పరిసరాలను శుభ్రం చేసుకుంటే గుడ్డు దశలోనే నిరోధించే పరిస్థితి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.



డెంగీ వ్యాధిపై ప్రజలతో అవగాహన ర్యాలీ

ఘనంగా జాతీయ డెంగీ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం పట్టణ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలైన వీకర్స్ కాలనీ, ఎన్టీఆర్ జంక్షన్, కడకట్ల, యాగర్లపల్లి పరిధిలో నిర్వహించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అనీషా, డాక్టర్ తనూజ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ప్రజలతో కలిసి అవగాహన ర్యాలీలు చేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దామని పిలుపునిచ్చారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు అర్బన్ హెల్త్ సెంటర్‌లలో, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యాధి లక్షణాలను బట్టి చికిత్స ఉంటుందన్నారు. కీటకజనితవ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లార్వ జనిత ప్రదేశాలను నిలువరించాలన్నారు. జ్వరము, కీళ్ల నొప్పులు ఉంటే ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని సూచించారు. దోమల నియంత్రణకు చర్యలు తప్పక చేపట్టాలని, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆశాలు, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

కాయ్ రాజా కాయ్..!

- జోరుగా సాగుతున్న పందాలు
- ఓ వైపు ఐపీఎల్.. మరోవైపు పొలిటికల్
- రూ.కోట్లకు చేరుకున్న జూదం
- గ్రామాల్లో సర్వత్రా ఉత్కంఠ
- విజయంపై వైఎస్సార్ సీపీ వర్గీయుల ధీమా

తణుకు: 'ఈ ఓవర్లో వికెట్ పడుతుంది.. మీది వెయ్యి మాది ఆరు వందలు'... 'మ్యాచ్ ఫలానా జట్టు గెలుస్తుంది.. మీ పందెం పదివేలు.. మాది పదిహేను వేలు' ఇది 'ఐపీఎల్ రోజువారీ బెట్టింగ్' 'మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. మా పార్టీ అభ్యర్థి మెజారిటీ ఇంత మీ పందెం రూ. లక్ష.. మాది రూ. 70 వేలు' ఇది రాజకీయ జూదం.. తణుకు ప్రాంతంలో పందాల జోరు హోరెత్తుతోంది. ఓ వైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగడంతో మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరో వైపు ఇండియన్ పొలిటికల్ లీగ్ తోడవడంతో బెట్టింగ్ రాయుళ్లకు పండగే పండగ. పట్టణం, పల్లెలు తేడా లేకుండా పందాలు జోరందుకున్నాయి. దాబాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు వేదికగా క్రికెట్‌తో పాటు పొలిటికల్ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. సగటున రూ.లక్షలు పందం కాస్తుండగా మొత్తంగా కలిపి రూ. కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ నాకౌట్ పోటీలతో పాటు ఎన్నికల ఫలితాలకు రోజులు దగ్గర పడుతున్న కొద్దీ ఈ బెట్టింగ్ విశ్వరూపం దాల్చే పరిస్థితి కనబడుతోంది. ఈ బెట్టింగ్‌లకు నగదుతో పాటు ఆస్తులు, వాహనాలు, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు కూడా పెడుతున్నట్లు తెలుస్తోంది.

మీది ఇంత.. మాది ఇంత..

ఐపీఎల్ విషయానికి వస్తే ఓవర్‌కు పరుగులు, వికెట్లు పడే సమయాలు, నోబాల్స్, వైడ్లు ఎప్పుడు పడతాయి.. ఫోర్లు, సిక్సర్లు ఎప్పుడు కొడతారు. వీటికి రూ.వేలల్లో పందాలు వేసుకుంటున్నారు. ఆఖరిగా మ్యాచ్ ఫలితాలపై భారీగానే పందాలు సాగుతున్నాయి. జట్ల బలాబలాలను బట్టి పందెంరాయుళ్లు బరిలోకి దిగుతున్నారు. ఒక జట్టు బలహీనంగా ఉంటే దానిపై తక్కువ మొత్తం పందెం వేస్తున్నారు. బలమైన జట్టు వైపు ఉన్నవారు దానికి కాస్త ఎక్కువ మొత్తం పందెం కాస్తున్నారు. ఉదాహరణకు బలమైన జట్టుపై రూ. పది వేలు పెడితే.. బలహీనమైన జట్టుపై రూ.5 వేలను నుంచి 7 వేల వరకు. ఈ పందాల కోసం ప్రత్యేకంగా పేకాట మాదిరిగా డెన్లు ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం.

కోసు పందాలు

రాజకీయ బెట్టింగ్ విషయానికివస్తే వివిధపార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని.. అదే సమయంలో వారికి వచ్చే మెజారిటీపై కూడా పందాలు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు సమయం ఉన్నందున ప్రాథమికంగా రూ. లక్షల్లో పందాలు కడుతున్నారు. ఫలితాల రోజు దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌లు ఘణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. పొలిటికల్ బెట్టింగ్ విషయంలో పందెంరాయుళ్లు సర్వేలను కూడా ఆధారం చేసుకుంటున్నారు. మొత్తానికి రానున్న మూడు వారాల పాటు బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగనుంది. అయితే ఈ మాయా జూదానికి పోలీసులు అడ్డుకట్ట వేయాల్సి ఉందని పలువురు భావిస్తున్నారు.

పట్టణంలో జోరుగా అభివృద్ధి పనులు



పైపులైను కోసం సిద్ధంగా ఉన్న పైపులు



డ్రెయిన్ల నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: పట్టణంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గవర్నమెంటు ఆస్పత్రి వద్ద రూ.11 లక్షలతో, రాళ్ల సాహెబ్ కాలనీ వద్ద రూ.34 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం సాగుతోంది. ఎస్వీఆర్ జంక్షన్ వద్ద రూ.99 లక్షలతో పైపులైన్ల విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు నిర్దేశించిన సమయంలో చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఏపిసెట్‌కు హాజరైన విద్యార్థినులు

తాడేపల్లిగూడెం: ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు గాను ఏపీ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపిసెట్ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఉదయం 220 మందికి గాను 198 మంది, సాయంత్రం పరీక్షకు 219 మందికి గాను 207 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షను ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ రావు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా రమేష్, టీసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల ద్వారానే డెంగీ సంక్రమణ



మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల ద్వారానే డెంగీ వ్యాధి సంక్రమిస్తుందని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ.వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణంలో దోమలు వృద్ధి చెందుతాయని, అవి కుట్టడం ద్వారా డెంగీ వ్యాధి వస్తుందన్నారు. శరీర ఉష్ణోగ్రత పెరగడం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, కండరాలు మంటలు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, మల, మూత్రాల్లో రక్తం కారడం, కడుపునొప్పి వంటివి డెంగ్యూ లక్షణాలుగా పేర్కొన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.సింధు, ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.అశోక్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వన్ టౌన్‌లోని రైల్వే ఫీడర్, పాతూరు సబ్ స్టేషన్ మహాలక్ష్మినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. జూబ్లీరోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, వెంకటరత్నం ఆసుపత్రి ఏరియా, పాతూరు, మహాలక్ష్మినగర్, చెట్లు రోడ్డు, సత్యవతినగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా టూ టౌన్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. భాగ్యలక్ష్మిపేట, సీతారామపేట, మార్కెట్ ఏరియా, తాళ్లముదునూరుపాడు, యాగర్లపల్లి, రామచంద్రరావుపేట, ఏలూరు రోడ్డు సమీప ప్రాంతాలు, పెంటపాడులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అత్తిలిలో..

అత్తిలి: అత్తిలి గ్రామంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలపై మొక్కలను తొలగింపు సందర్భంగా అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడివీధి, గోగులమ్మపేట, గాంధీనగర్, రామన్నపేట, బ్యాంకువీధి, తెనుకులవారికళ్లం, పడవలరేవు, మసీదు ఏరియా, బస్‌స్టేషన్ ఏరియా మంచిలి రోడ్డు, లక్ష్మీనగర్, చినపేట, మట్టపర్తిగర్వు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా వరదరాజ స్వామి కల్యాణం



దుంపగడపలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో వేంచేసియున్న అతి పురాతన వరద రాజాస్వామి ఆలయంలో త్రయాహ్నిక దీక్షతో కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామిశెట్టి సూర్య ప్రసాద్ దంపతులు పాల్గొన్ని శాస్త్రోక్తంగా కల్యాణ తంతును జరిపించారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మూర్తి హోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని చైర్మన్ సూరి ప్రసాద్ చెప్పారు.

భవిత సెంటర్‌లో పిల్లల పేర్లు నమోదు చేయించాలి



భవిత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడి వయస్సు ఉన్న దివ్యాంగ పిల్లలను, బడి మానేసిన దివ్యాంగుల పిల్లలను గుర్తించి పాఠశాలలో, భవిత సెంటర్‌లలో పేర్లు నమోదు చేయించాలని ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య వెల్లడించారు. దివ్యాంగుల పిల్లల ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా గురువారం స్థానిక భవిత సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్స్‌కు కరపత్రాలు పంపిణీ, అవగాహన ర్యాలీ చేశారు. బాలీశ్వరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను భవిత సెంటర్, పాఠశాలలో చేర్చేందుకు వీలుగా జూన్ 9వ తేదీ వరకు డ్రైవ్ జరుగుతుందని తెలిపారు. సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగులకు అందే ఉచిత అలవెన్స్‌లు, ఉచిత ఉపకరణాలు, ఉచిత విద్యా సామగ్రిలు తదితర అంశాలపై అంగన్‌వాడీలకు అవగాహన చేశారు. భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య అందుబాటులో ఉన్నాయని, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ప్రత్యేక ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి సువార్త సభలు

ఉండి: ఉండికి చెందిన పెనూయేలు ప్రెయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు 19వ వార్షికోత్సవ సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఈద విజయప్రసాద్, దాయం సునీత తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు చర్చ్‌లో జరిగే ఈ సభలకు రెవరెండ్ వి.జ్యోతిబాబు (ఇలపర్రు), రెవరెండ్ కె.జార్జ్‌బుష్(ఉయ్యూరు) వాక్యోపదేశం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొనాలని కోరారు.